


# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక




సంపుటి: 01 సంచిక : 280. ఎడిటర్ : సింగిడి అమృత్ తెలంగాణ గురువారం.24.07.2025 పేజీలు:4, వెల:రూ.1.00

# కేంద్రం బీసీ బిల్లు ఆమోదించాలి

న్యూఢిల్లీ : అమృత్ తెలంగాణ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో తెలంగాణలో స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైకోర్టు సైతం 90 రోజుల్లో (సెప్టెంబరు నెలాఖరులోగా) స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, 30 రోజుల్లో (జులై నెలాఖరులోగా) రిజర్వేషన్లు ఖరారు చేయాలని ఆదేశించిందన్నారు. బుధవారం నాడిక్కడ తన అధికారిక నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మాట్లాడారు. బీసీలకు విద్యా, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్లు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి తెలంగాణ అసెంబ్లీలో పూర్తిస్థాయిలో చర్చించి ఆమోదించిన రెండు బిల్లులను ఆమోదించడంలో కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేస్తోందని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రెండు బిల్లుల ఆమోదానికి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గేలను గురువారం ఉదయం కలిసి తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ ,కుల సర్వే జరిపిన తీరు, రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన విధానాలను వివరిస్తామని తెలిపారు.



సాయంత్రం కాంగ్రెస్ లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు ఈ అంశాన్ని వివరిస్తామని సీఎం వెల్లడించారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే తెలంగాణ ప్రభుత్వం చేసిన రెండు బిల్లుల ఆమోదానికి పట్టుపడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి తెలంగాణ శాసనసభలో బీజేపీ, బీఆర్ఎస్, సీపీఐ, ఎంఐఎం మద్దతు పలికాయని ఆయన గుర్తుచేశారు. బీసీలకు రిజర్వేషన్లను అడ్డుకునేందుకు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, సంజరు ముస్లింలను సాకుగా చూపుతున్నారని సీఎం మండిపడ్డారు. ప్రధాని మోడీ సొంత రాష్ట్రం గుజరాత్, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తరప్రదేశ్, ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం ఉన్న మహారాష్ట్రలోనూ ముస్లింలకు రిజర్వేషన్లు అమలవుతున్నాయనీ బీజేపీ నేతలకు దమ్ముంటే ఆ రాష్ట్రాల్లో ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని ప్రకటించాలని సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. గుజరాత్‌లో ముస్లింలకు రిజర్వేషన్లు అమలవుతున్నాయని ఇక ముందు అమలు చేస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఒక ఇంటర్వ్యూలో చెప్పిన విషయాన్ని ప్రస్తావిస్తూ, బీజేపీ నేతలు అందుకు ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారా అని సీఎం ప్రశ్నించారు.

తెలంగాణలో సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్యా, రాజకీయ, కుల సర్వే ప్రక్రియను 2024, ఫిబ్రవరి 4న మొదలు పెట్టి 2025, ఫిబ్రవరి 4వ తేదీ నాటికి పూర్తి చేసి శాసనసభలోనూ ఆమోదించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

అందుకే తెలంగాణలో ఫిబ్రవరి 4ను సామాజిక న్యాయ దినోత్సవంగా (సోషల్ జస్టిస్ డే) జరుపుతున్నామని తెలిపారు. ఈ సర్వేలో తెలంగాణలో 3.55 కోట్ల మంది వివరాలు సేకరించామని సీఎం పేర్కొన్నారు. సర్వే వివరాలను శాసనసభ ముందుంచామని దాని ప్రకారం 56.4 శాతం బీసీలు, 17.45 శాతం ఎస్సీలు, 10.08 శాతం ఎస్టీలు, 10.09 శాతం ఉన్నత వర్గాల వారు ఉన్నారని సీఎం చెప్పారు. తెలంగాణలో 3.09 శాతం మంది తాము ఏ కులానికి చెందని వారిమని ప్రకటించారని.. తెలంగాణలో ఇదో కొత్త పరిణామమని అన్నారు.

సర్వే వివరాలను స్వతంత్ర నిపుణుల సలహా కమిటీకి ఇచ్చామని, వారు దానిపై చర్చించి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారని ముఖ్యమంత్రి తెలిపారు. ఆ నివేదికను మంత్రివర్గంలో చర్చించి శాసనసభలో ప్రవేశపెడతామని వెల్లడించారు. సర్వే చేసినప్పటికీ వ్యక్తిగత వివరాలు వెల్లడించకూడదని అది వ్యక్తిగత డేటా ప్రైవసీ యాక్ట్‌కు విరుద్ధమని సీఎం ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

**దేశానికే రోల్‌మోడల్‌గా కులగణన**

కులగణన విషయంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కులగణన చేపట్టమని సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించిన బీజేపీ ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం కులగణన చేపట్టాక తమను అనుసరిస్తూ కులగణనకు గెజిట్ విడుదల చేసిందన్నారు.. తెలంగాణ వేసిన రోడ్ మ్యాప్‌ను దేశవ్యాప్తంగా కులగణన సేకరణకు కేంద్ర ప్రభుత్వం వినియోగించుకోవాలని సీఎం సూచించారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు భారత్ జోడో యాత్ర చేపట్టిన రాహుల్ గాంధీ తాము అధికారంలోకి వస్తే కుల గణన చేపడతామని తెలంగాణలో ప్రకటించారని, ఆయన ప్రకటించినట్టుగానే తెలంగాణలో అధికారంలోకి రాగానే కుల గణన చేపట్టామని తెలిపారు.

రాబోయే 2029 లోక్‌సభ ఎన్నికలు ఓబీసీ రిజర్వేషన్లకు లిట్మస్ టెస్ట్‌గా నిలుస్తాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. రైతు వ్యతిరేక బిల్లుల రద్దు విషయంలోనూ తొలుత మొండికేసిన బీజేపీ ప్రభుత్వాన్ని మెడలు వంచి రద్దు చేయించామని కులగణన విషయంలో తమ మార్గంలో నడిచేలా చేశామని సీఎం తెలిపారు. ఈడబ్ల్యూఎస్ కు 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వడంతోనే 50 శాతం రిజర్వేషన్ల పరిమితి అంశం పక్కకు పోయిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

**ఉప రాష్ట్రపతి పదవి తెలంగాణకు ఇవ్వాలి**

ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ రాజీనామాకు కారణాలేమిటో తనకు తెలియదని, కానీ ఆ రాజీనామా దురదృష్టకరమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఉప రాష్ట్రపతి పదవిని ఈదఫా తెలంగాణకు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఉప రాష్ట్రపతిగా ఉన్న తెలుగు వ్యక్తి వెంకయ్య నాయుడును రాష్ట్రపతి కాకుండానే ఇంటికి పంపించారని, సికింద్రాబాద్ నుంచి గెలిచి కేంద్రమంత్రిగా ఉన్న బీసీ నేత దత్తాత్రేయను గవర్నర్‌గా పంపి ఆ పదవిని కిషన్ రెడ్డికి ఇచ్చారని సీఎం అన్నారు. బీసీ నేతగా ఉన్న సంజరును బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించి కిషన్ రెడ్డికి, ఆయన తర్వాత రాంచందర్‌రావుకు ఇచ్చారని, బీసీలకు బీజేపీ అన్యాయం చేసిందని సీఎం విమర్శించారు. దత్తాత్రేయకు గవర్నర్ పదవీ ఇచ్చే కాలం కూడా ముగిసిపోయిందన్నారు. అయితే బీసీలకు చేసిన ఈ అన్యాయాన్ని సరిచేసుకునేందుకు దత్తాత్రేయకు ఉప రాష్ట్రపతి పదవి ఇస్తే బాగుంటుందని సీఎం అభిప్రాయ పడ్డారు. అయితే ఉప రాష్ట్రపతి ఎన్నికలో అంతిమ నిర్ణయం కాంగ్రెస్ అధిష్టానానిదేనని, తనకు అవకాశం ఉంటే దత్తాత్రేయకు మద్దతు ఇచ్చే విషయంలో ప్రయత్నం చేస్తానని సీఎం ఓ ప్రశ్నకు సమాధానం చెప్పారు. స్థానిక సంస్థల్లో ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేసే విషయాన్ని తీవ్రంగానే పరిశీలిస్తున్నామని మరో ప్రశ్నకు సీఎం రేవంత్ రెడ్డి బదులిచ్చారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు (బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ శాఖలు) షబ్బీర్ అలీ, హర్కార వేణుగోపాల రావు (ప్రొటోకాల్, ప్రజా సంబంధాలు), ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్‌రెడ్డి, రఘురామిరెడ్డి, పోరిక బలరాం నాయక్, కుందూరు రఘువీర్ రెడ్డి, గడ్డం వంశీ కృష్ణ, డాక్టర్ కడియం కావ్య, సురేశ్ షెట్కార్, అనిల్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# రేపు రాష్ట్ర క్యాబినెట్ భేటీ




హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: రాష్ట్ర మంత్రి వర్గం శుక్రవారం భేటీ కానుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన. హైదరాబాద్‌లోని బీఆర్.అంబేద్కర్ సచివాలయంలో సాయంత్రం 4 గంటలకు జరిగే సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. రాష్ట్రంలో ప్రతి 15 రోజులకొకసారి మంత్రి వర్గ సమావేశం నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో ప్రభుత్వం శుక్రవారం క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌పై క్యాబినెట్ భేటీలో ప్రధాన చర్చ జరిగే అవకాశం ఉంది. వానాకాలం పంటసాగు, ఎరువుల కొరతపై సమావేశంలో చర్చించనున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి ఆరోపణలపై కొనసాగుతోన్న విచారణలపై ఈ సమావేశం చర్చించనుంది. సంక్షేమ, అభివృద్ధి పథకాల నిధుల సమీకరణపె క్యాబినెట్ ప్రత్యేక దృష్టి సారించనుంది. వివిధ శాఖల అధికారులు మంత్రి వర్గం పరిశీలన కోసం ఆమోదించబడిన అజెండా అంశాలను గురువారం సాయంత్రానికి అందజేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు బుధవారం సర్క్యులర్ జారీ చేశారు.

# మూడో రోజూ అట్టుడికిన పార్లమెంట్




న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల మూడోరోజూ ఉభయసభలు అట్టుడికాయి. పహల్గాం ఉగ్రదాడి, ఓటర్ల జాబితా సవరణ అంశాలు పార్లమెంట్‌ను కుదిపేస్తున్నాయి. బీహార్ ఎస్ఐఆర్, పహల్గాంపై చర్చకు డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు చేపట్టిన ఆందోళ నతో బుధవారం కూడా పార్లమెంట్ ఉభయసభలు స్తంభించాయి. ఎలాంటి చర్చ జరగకుండానే నేటీకి వాయిదా పడ్డాయి. బుధవారం ఉదయం 11 గంటల కు ఉభయసభలు మొదలవగానే.. బీహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ (ఎస్ఐఆర్) పేరుతో చేపట్టిన ఓటర్ల జాబితా సవరణపై ప్రతిపక్ష ఎంపీలు నిరసన గళం వినిపించారు. ఎన్నికలకు కేవలం రెండు నెలల ముందు ఆగమేఘాల మీద ఓటర్ల జాబితాను సవరించడం ప్రజాస్వామ్య విరుద్ధ మని మండిపడ్డారు.

అంతేకాక ఎన్నికల వేళ బీజేపీ వ్యతిరేక ఓటర్లను జాబితా నుంచి తొలగించేందుకు ఎన్నికల సంఘం కేంద్రంతో కలిసి కుట్రకు తెరలేపిందని విమర్శించారు. ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితాను సవరించ డం ఈ మధ్య కాలంలో పరిపాటిగా మారిందని ఆరోపించారు. ఈ విషయంపై ప్రతిపక్ష ఎంపీలు ఇచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చకు సభ్యులు డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల ఆందోళనతో ఉభయ సభలు మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడ్డాయి. ఆ తరువాత సభలు తిరిగి ప్రారంభమైనా లోక్‌సభలో అదే సీన్ రిపీట్ అయింది. ప్రతిపక్ష ఎంపీలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ బీహార్ ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు డిమాండ్ చేశారు. ఫలితంగా సభలో తీవ్ర గందరగోళం చోటుచేసుకుంది. దాంతో లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. అంతకుముందు ప్రతిపక్షాల ఆందోళన మధ్యే కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ జాతీయ డోపింగ్ నిరోధక (సవరణ) బిల్లు, జాతీయ క్రీడా పాలన బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లులు క్రీడా రంగంలో పారదర్శకతను పెంపొందించే లక్ష్యంతో రూపొందించినట్టు తెలిపారు. తిరిగి ప్రారంభమైన ఉభయ సభల్లో పరిస్థితుల్లో ఎలాంటి మార్పు కనబడకపోవడంతో నిమిషాల్లో ఉభయ సభలు గురువారానికి వాయిదా పడ్డాయి.

**జులై 29 నుంచి ఆపరేషన్ సిందూర్‌పై చర్చ**

ఈ వర్షాకాల సమావేశాల్లో ఆపరేషన్ సిందూర్‌పై జులై 29న చర్చ జరగనుంది. లోక్‌సభలో 16 గంటలు, రాజ్యసభలో 9 గంటల పాటు చర్చించేందుకు సమయాన్ని కేటాయించారు. బుధవారం జరిగిన బిజినెస్ అడ్వైజరీ మీటింగ్ (బీఏసీ)లో దీనిపై నిర్ణయం తీసుకున్నారు. అయితే చర్చ ముగిసిన తరువాత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చర్చపై సమాధానం ఇవ్వనున్నారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై విస్తృత స్థాయిలో చర్చ నిర్వహించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ ఉభయసభల్లోనూ ప్రతిపక్షాలు ఆందోళనలు చేస్తున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి.

**'ఆపరేషన్ సిందూర్'ను ఆపినట్టు ట్రంప్ 25 సార్లు చెప్పడంలో మర్మమేంటీ? : రాహుల్ గాంధీ**

ఆపరేషన్ సిందూర్‌ను ఆపింది తానేనని ట్రంప్ 25 సార్లు చెప్పడంలో మర్మమేంటీ అని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. పార్లమెంట్ ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మోడీ సర్కారు విదేశాంగ విధానాన్ని ఆయన ప్రశ్నించారు. ఇండియా, పాకిస్తాన్ మధ్య యుద్ధాన్ని ఆపింది తానే అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటిస్తున్నారని, దీని వెనుక ఉన్న ఆంతర్యం ఏంటో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇండో, పాక్ ఉద్రిక్తతల వేళ ఐదు యుద్ధ విమానాలు కూలిన అంశాన్ని కూడా ట్రంప్ ఇటీవల మళ్లీ మళ్లీ లేవనెత్తడంతో ప్రతిపక్షాలు దీనిపై అనుమా నాలు వ్యక్తం చేస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోందని ఓ వైపు చెబుతున్నారని, మరో వైపు విజయం సాధించినట్టు చెబుతు న్నారని, డొనాల్డ్ ట్రంప్ మాత్రం ఆపరేషన్ సిందూర్‌ను ఆపింది తానే అని చెప్పారని, దీంట్లో ఏదో మర్మం ఉందని, మన విదేశాంగ విధానాన్ని ఏ దేశం కూడా సపోర్టు చేయలేదని రాహుల్ గాంధీ అన్నారు. దీనిపై కేంద్రం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశ భక్తులమని చెప్పుకుంటున్న వారు సమాధానం చెప్పకుండా తప్పించుకుని తిరుగుతున్నారని, ప్రధాని దీనిపై కనీసం ఒక్క ప్రకటనా చేయలేద ని తెలిపారు. 'ఇది తన పనేనని ప్రకటన చేయడానికి ట్రంప్ ఎవరు? ఇది ఆయన పని కాదు. ప్రధాని ఇంతవరకూ స్పందించక పోవడం వాస్తవం' అని పేర్కొన్నారు.

**పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్షాల ఆందోళన**

బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ (ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష పార్టీల నేతలు పార్లమెంట్‌లో ఆందోళన చేపట్టారు. బుధవారం పార్లమెంట్ ఉభయ సభల ప్రారంభానికి ముందు మకర ద్వారం ఎదురుగా ప్రతిపక్ష ఇండియా బ్లాక్ పార్టీల నేతలు ప్లకార్డులు చేబూని ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నినాదాల హోరెత్తించారు. ప్రభుత్వ రివ్యూ ఉద్దేశం, చట్ట బద్ధతను స్పష్టం చేయాలని డిమాండ్ చేశారుఈ ఆందోళనలో కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఎస్పి నేత అఖిలేష్ యాదవ్, డీఎంకే నేతలు కనిమొళి, టిఆర్ బాలు, ఎ.రాజా, ఆర్‌జెడి ఎంపీలు మీసా భారతి, మనోజ్ కుమార్ ఝా, సీపీఐ(ఎం) ఎంపీలు అమ్రారామ్, సచ్చితానందన్ తదితర పార్టీలఎంపీలు పాల్గొన్నారు. బీహార్‌లో ఎస్ఐఆర్ సమస్య,పహల్గాం ఉగ్రవాద దాడి, నిఘా వైఫల్యాలపై పార్లమెంటులో చర్చ జరగాలని ఎస్పి ఎంపీ డింపుల్ యాదవ్ ప్రశ్నించారు.

# కంచ గచ్చిబౌలి భూములు ప్రభుత్వానివే

న్యూఢిల్లీ అమృత్ తెలంగాణ: కంచ గచ్చిబౌలివి ప్రభుత్వ భూములే అని, అటవీ భూములు కాదని సర్వోన్నత న్యాయస్థానానికి రాష్ట్ర ప్రభుత్వం మరోసారి తేల్చి చెప్పింది. అందుకు సంబంధిం చిన రెవెన్యూ డిపార్ట్‌మెంట్ రికార్డులు, ఉమ్మడి ఏపీ ప్రభుత్వ హయాంలో అందుకు తగ్గట్టుగా రిలీజ్ చేసిన జీవోలను కోర్టుకు సమర్పించింది. ఈ భూమిని ఫారెస్ట్ ల్యాండ్‌గా ప్రకటించాలని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ (సీఈసీ) పేర్కొన్న అంశాలు సరికాదని తెలిపింది. ఈ మేరకు మంగళవారం సమగ్ర వివరాలతో మొత్తం 43అంశాలతో కూడిన 56 పేజీల అడిషనల్ అఫిడవిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎస్ రామకృష్ణారావు సుప్రీంకోర్టులో దాఖలు చేశారు. ఈ అఫిడవిట్‌లో 2001 లో అప్పటి ఉమ్మడి ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ పేరుతో జారీ చేసిన జీవో నెంబర్ 538, 2006లో కంచ గచ్చిబౌలి కార్టోసాట్ ఈమేజెనరీ, 2024లో తీసిన గూగుల్ ఎర్త్ ఈమేజేనరీ, 2025 ఏప్రిల్‌లో సేకరించిన సెంటినల్ శాటిలైట్ డేటాను ఈ అఫిడవిట్‌కు జత చేశారు. అలాగే క్షేత్రస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన వాస్తవాలు, ఇతర అంశాలతో కూడిన వివరాలను దీనికి పొందుపరిచారు.



**అటవీ భూమి కాదు**

సీఈసీ పేర్కొన్నట్టు కంచ గచ్చిబౌలి భూమి అటవీ భూమి కాదని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. గత అఫిడవిట్ లోనే ఈ అంశాన్ని స్పష్టం చేసినట్టు తెలిపింది. ఈ భూ ములు 'కంచ పోరంబోకు సర్కారీ' భూములుగా 1954-55 లోనే రెవెన్యూ రికార్డుల్లో నమోదైందని, ఈ భూముల్ని ప్రభుత్వం అటవీ భూమిగా గుర్తించలేదని తెలిపింది. 'కంచ' అంటే వ్యవసాయానికి లేదా పబ్లిక్ పర్పస్‌కు ఉపయోగించని భూమి అని వివరించింది. ఆ తర్వాత ఈ భూముల్ని 2001 అక్టోబర్‌లో ఆనాటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వంలోని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ రూపొందించిన మాస్టర్ ప్లాన్‌లో 'పబ్లిక్ అండ్ సెమీ పబ్లిక్ యూజ్' కింద పేర్కొందని ప్రస్తావించింది. అనంతరం 2007 నుంచి ఈ భూమి వ్యవహారం కోర్టులో నడిచిందని, దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ప్రభుత్వానికి చెందిందని కోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపింది. దీంతో ఈ భూమి దట్టమైన అటవీ ప్రాంతంగా మారినట్టు కార్టో సాట్, గూగుల్ ఎర్త్ ఈమెజేనరీ, సెంటిసెల్ శాటిలైజ్ చిత్రాలు చూపుతున్నాయని తెలిపింది.

**హైదరాబాద్ జీసీసీలకు గమ్యస్థానం**

నానక్ రాంగూడ, మాదాపూర్, రాయదుర్గం ప్రాంతాలను ఐటీ జోన్లుగా తీర్చిదిద్దేందుకు ఉమ్మడి ఏపీ, ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ క్లస్టర్లలో దాదాపు రూ. 99, 880 కోట్ల ఇన్వెస్టర్లను ఆకర్షించిందనీ, తద్వారా 7.5 లక్షల మందికి ఉద్యోగావకాశాలు దక్కాయని తెలిపింది. ఇది హైదరాబాద్‌ను గ్లోబల్ క్యాపబిలిటి సెంటర్ల (జీసీసీ)ల గమ్యస్థానంగా మార్చిందని పేర్కొంది. 2024లో కొత్తగా70 జీసీసీలను ఆకర్షించినట్టు వివరించింది. తద్వారా రూ.16 వేల కోట్ల పెట్టుబడులు, 84 వేల మందికి జాబ్స్ రానున్నట్టు తెలిపింది. అందువల్ల ఈ 400 ఎకరాల్లో సుస్థిర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్లాన్ చేసింది.

**ఇండిస్ట్రీయల్ పార్క్‌ల్లో లక్షకుపైగా మొక్కలు**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇండిస్ట్రీయల్ పార్క్‌లు, ఇతర చోట్ల 1.23లక్షల మొక్కలు నాటుతున్నట్టు అడిషనల్ అఫిడవిట్‌లో ప్రభుత్వం పేర్కొంది. ఇందులో మేడ్చల్ - సిద్దిపేట, శంషాబాద్, పటాన్ చెరు, సైబారాబాద్‌లో 40, 500 మొక్కలు నాటనున్నట్టు తెలిపింది. అలాగే 2.13 కోట్లతో ఎస్ఎఫ్ పీజీ వరంగల్, యెంకతల, గోల్కొండ ఆర్టిలరీ సెంటర్, జహీరాబాద్ నిమ్జ్‌లో 82, 500 మొక్కలు నాటుతున్నట్టు పేర్కొంది. వీటితో పాటు ఓఆర్ఆర్ ఇన్‌సైడ్, అవుట్‌సైడ్‌లో మొత్తం 135 ఎకరాల్లో మొక్కలు నాటుతున్నట్టు కోర్టుకు నివేదించింది. ఇందుకు సంబంధించిన ఫొటోలను కూడా అఫిడవిట్‌కు ప్రభుత్వం జత చేసింది

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంకండి...... జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్ రెడ్డి, పిలుపు



ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న సామ రాజేశ్వర్ రెడ్డి,



పాల్గొన్న బిజెపి కార్యకర్తలు

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జీ జూలై 23 అమృత్ తెలంగాణ నర్సాపూర్ మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం లో బిజెపి మండల స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో లిజిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్ రెడ్డి, మాట్లాడుతూ రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బిజెపి జెండా ఎగరావేయడం కోసం ప్రతీ కార్యకర్త కలిసిమెలిసి పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షులు బర్కుంట నరేందర్, జిల్లాకార్యదర్శి రాజేందర్, మండల ప్రధాన కార్యదర్శి మహిపాల్,మాజీ సర్పంచ్ లు మహేష్, సురేష్, సాయన్న, నాయకులు అర్జున్,దత్తురాం, భోజన్న వైస్ చైర్మన్, చందు గౌడ్, శంకర్,భూమన్న, లక్ష్మణ్, సంజయ్, సాయి దత్తు, పల్లపు రాజు, అశోక్, సంతోష్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు...

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న భోస్లే మోహన్ రావ్ పటేల్?

## మహాగాం మరియు పార్డి(బి) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వంత నిధులతో ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో వాటర్ పురిఫైర్ యంత్రాన్ని ప్రారంభించిన ట్రస్ట్ చైర్మెన్



ఘనంగా సన్మానించిన ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు



పాఠశాల విద్యార్థులతో కలిసి ఆర్ఓ ప్లాంట్ను ప్రారంభిస్తున్న మోహన్ రావు పటేల్,



ప్రారంభించిన ఆర్వో ప్లాంట్ దృశ్యం

నిర్మల్ జిల్లా బైంసా:- జూలై 23 అమృత్ తెలంగాణ విద్యార్థులు చిన్నప్పటి నుండే ఒక లక్ష్యాన్ని ఏర్పర్చుకుని ఆ లక్ష్య సాధన దిశగా చదివి మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకరావాలని మోహన్ రావు ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పటేల్ సూచించారు. గత మార్చి నెలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీలో భాగంగా మహగాం, పార్డి (బి) ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లిన మోహన్ రావు పటేల్ కు విద్యార్థులు నీటి సమస్య ఉందని ఆయన దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేస్తాననీ హామీచ్చారు. ఈ హామీ మేరకు మహగాం, పార్డి (బీ) ప్రభుత్వ ఉన్నత పాటశాలలో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేయగా, బుధవారం గ్రామస్థులు మరియు పాఠశాల సిబ్బంది మరియు విద్యార్తులతో కలిసి ప్రారంభించారు. ఆర్వో ప్లాంట్లకు ప్రత్యేక పూజలు చేసి నీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ముమ్మందు ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకుని పాఠశాల, తల్లిదండ్రులు, ఊరి పేరు నిలబెట్టాలని సూచించారు. సమయం వృథా చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యా వైద్యం విఫలం

## బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహారాజ్



భోజనం బాగా లేక పిల్లలు తినకపోవడంతో వృధాగా పడేసిన భోజనాన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేసిన విశారదన్ మహారాజ్,



డాక్టర్లతో కలిసి 30 పడకల ఆసుపత్రిని పరిశీలించిన విశారదన్ మహారాజ్



నర్సాపూర్ జెడ్ పి ఎస్ ఎస్ ప్రభుత్వం పాఠశాలలో పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన విశారదన్ మహారాజ్,

నిర్మల్ జిల్లా నర్సాపూర్ (జి) జులై 23 అమృత్ తెలంగాణ. ఏర్పడ్డ తెలంగాణలో నాడు టిఆర్ఎస్ ప్రభుత్వం, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వైద్య రంగాల్లో పూర్తిగా విఫలమైందని బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహారాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్ పాఠశాలను, 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెట్టే బియ్యం రీసైకిల్ బియ్యమని, అసలైన సన్న రకం బియ్యం కావన్నారు. ఈ అన్నం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తింటాడా అని ప్రశ్నించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సంపూర్తిగా లేదని, ప్రతిరోజు 500 మంది విద్యార్థులకు 40 కిలోల కందిపప్పుతో కూర వండాలని పెట్టాలని సూచించారు. విద్యార్థులకు కనీసం మూత్రశాలలు లేకుండా చేయడం పేద వర్గాల పిల్లలకు విద్య అందకుండా చేసే కుట్రగా పేర్కొన్నారు. 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంలో మధ్యాహ్నం 1:30 గంటలకు ఒక్క వైద్యుడు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించబడ్డ ఈ ఆసుపత్రిలో ప్రభుత్వ వైద్యుల్ని నియమించడంలో, పేదలకు వైద్యం అందించడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి అన్నెల లక్ష్మణ్, జిల్లా కన్వీనర్ రామగిరి రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు రాజు మహారాజ్ సిహెచ్ శ్రీనివాస్ సుధాకర్ రాములు మురళి రాజు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిది చెక్కుల పంపిణీ.... తన నివాసంలో అందజేసిన మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి,



సీఎం సాయనిది చెక్కులను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి



నిర్మల్ జిల్లా దేగాం జులై 23 అమృత్ తెలంగాణ దేగాం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి నివాసంలో సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేయడం జరిగింది బైంసా పట్టణ కేంద్రానికి చెందిన ఎస్ డి ఫరీద్ 37వేల రూపాయల 500,సమ్రీన్ బేగం 60 వేల రూపాయలు జె.రాజు 39వేల రూపాయలు కుంటాల మండలంలోని దౌనెల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులు గోపు సునీత ?56,000 వేలు గంగామణి 38,500 వేలు చెక్కులను బుధవారం రోజు బాధితులకు అందజేయడం జరిగింది. చెక్కులు మంజూరు చేసి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి నిర్మల్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు కు మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలపడం జరిగింది ఈ కార్యక్రమంలో బైంసా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండి ఫరూక్ అహ్మద్, ఖాలీద్ ఖాన్, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్,కోలూరు గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, దౌనెల్లి మాజీ సర్పంచ్ హైమద్, ఏఎంసీ డైరెక్టర్ సాయి కిరణ్, తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు

# వన మహోత్సవాన్ని వేగవంతంగా పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ పచ్చదనం పెంపే లక్ష్యంగా జిల్లాలో వన మహోత్సవ కార్యక్రమాన్ని వేగవంతంగా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు బుధవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో వన మహోత్సవం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వనమహోత్సవం లో భాగంగా ఆయా శాఖల ఆధ్వర్యంలో విరివిగా మొక్కలు నాటాలని ఆదేశించారు. జిల్లాలో ఈ సంవత్సరం 69 లక్షలు 55వేల మొక్కలు నాటేలా ప్రణాళికలను రూపొందించడం జరిగిందని తెలిపారు. ఇప్పటివరకు ఆయా శాఖల ఆధ్వర్యంలో 44 శాతం మొక్కలు నాటడం జరిగింది అని తెలిపారు. శాఖల వారిగా నాటిన మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్న కలెక్టర్, రాబోయే 15 రోజులలోపు మొక్కలు నాటే ప్రక్రియను పూర్తిచేయాలని, ప్రతి మొక్కను జియోట్యాగ్ చేయాలని స్పష్టం చేశారు. హార్టికల్చర్ మొక్కల నాటుదలకు వ్యవసాయ శాఖ సహకారం తీసుకోవాలని ఎంపీడీఓలకు సూచించారు. మొక్కలు నాటిన వెంటనే సంబంధిత వివరాలు అటవీ శాఖ అధికారులకు పంపించాలని అన్నారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై సమీక్షించిన కలెక్టర్, వెంటనే నిర్మాణాలను పూర్తి చేయాలని, మార్కౌట్ పూర్తి చేసిన ఇండ్లకు గ్రౌండింగ్ పనులు తక్షణమే ప్రారంభించాలన్నారు. మేస్త్రీల కొరత ఉండకుండా తగిన సన్నాహాలు చేసుకోవాలని సూచించారు. ఇసుక కొరత రాకుండా తహసీల్దార్లు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకానికి సంబంధించి లబ్ధిదారుల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, డిఎఫ్ఓ నాగిని భాను, ఆర్డీవోలు రత్నకల్యాణి, కోమల్ రెడ్డి, డీఈఓ పీ. రామారావు, జెడ్పి సీఈవో గోవింద్, డిపిఓ శ్రీనివాస్, ఏడి సర్వే -ల్యాండ్ రికార్డ్ ఆర్. సుదర్శన్ సహా పలువురు జిల్లా, మండల స్థాయి అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

# కుండ పోతగా కురుస్తున్న వర్షం లో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసులు - నారి శక్తి కార్యక్రమం




అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ నిర్మల్ జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్న ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, జిల్లా పోలీసు శాఖ "నారిశక్తి" కార్యక్రమాన్ని అధిక ఉత్సాహంతో, అవిశ్రాంతంగా కొనసాగిస్తోంది. మహిళలు ఎందులోనూ తక్కువ కాకూడదు అనే సదుద్దేశంతో జిల్లా ఎస్పీ తన విన్నూత్న ఆలోచనతో ప్రతీ బుధవారం నిర్వహించే ఈ నారిశక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా పోలీస్ సిబ్బంది వర్షంలోనూ ఎలాంటి వెనుకడుగు వేయకుండా, బ్లూ కోల్ట్స్, పెట్రో కార్లు, 100 డయల్, ట్రాఫిక్ విభాగాల సమన్వయంతో:

వాహన తనిఖీలు

విలేజ్ విజిటింగ్

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

మహిళలకు భద్రతపై అవగాహన కార్యక్రమాల్లో చాలా చురుకుగా పాల్గొంటున్నారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపిఎస్ మాట్లాడుతూ.. వర్షాలు ఎంత కురిసినా,బాధ్యతల నుంచి ఒక్క క్షణం వెనక్కి తగ్గకుండా నారిశక్తులు ప్రజల రక్షణ కోసం ముందుండి పని చేయడం చాలా గర్వించ దగిన విషయం అని తెలిపారు

# విరిగిపడ్డ ఫ్యాన్.. పిల్లాడి తలకు తీవ్ర గాయాలు

కుభీర్: ఫ్యాన్ విరిగిపడి విద్యార్థికి గాయాలైన సంఘటన కుబీర్ మండలంలోని కస్ర గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం అంగన్వాడి కేంద్రంలో పిల్లలు చదువుకుంటూ ఉండగా ఒక్కసారిగా ఫ్యాన్ విరిగిపడి వీరాజ్ 3 అనే పిల్లవాడిపైన పడడంతో తలకు తీవ్ర గాయమైంది వెంటనే పిల్లవాడిని చికిత్స నిమిత్తం హాస్పిటల్ కు తరలించి చికిత్స అందించారు. సంఘటన జరిగిన సమయానికి అంగన్వాడీ టీచర్ అంగన్వాడీలో లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంగన్వాడి టీచర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని మండిపడుతున్నారు.

పిల్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న తహసిల్దార్

ఫ్యాన్ విరిగిపడి పిల్లవాడి తలకు గాయాలైన విషయం తెలుసుకున్న తహసిల్దార్ బుధవారం కస్ర గ్రామానికి వెళ్లి అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కరెంట్ బోర్డు నుండి డైరెక్ట్ గా ఫ్యాన్ కనెక్షన్ ఇవ్వడంతో ప్రమాదం జరిగి ఉంటుందని అంచనా వేశారు.వెంటనే దగ్గర ఉండి నూతన ఫ్యాన్ ను పెట్టించడం జరిగింది. అనంతరం అక్కడి నుండి పిల్లాడి దగ్గరకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పిల్లవాడికి అయ్యే వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని ఎలాంటి ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని ఆ కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు. అనంతరం ఐసిడిఎస్ అధికారులతో మాట్లాడుతూ మండలంలో అంగన్వాడీ సెంటర్లలో ఫ్యాన్లు, కరెంటు బోర్డుల పరిస్థితిని సోమవారం రోజు వరకు రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించారు. మీ నిర్లక్ష్యం వల్లే ఈ సంఘటన జరిగిందని మండిపడ్డారు. ఇలాంటివి మళ్ళీ పునరావృతం అయితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# అనంతారంలో ఉచిత మెగా ఐ, డెంటల్ క్యాంపు

భువనగిరి : మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ అనంతారంలో రోటరీ క్లబ్, మ్యాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి హైదరాబాద్ , వజ్ర డెంటల్ క్లినిక్ భువనగిరి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా ఐ / డెంటల్ క్యాంపు ను డా. సోమవరపు రాంప్రసాద్ గవర్నర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కొరకు రోటరీ క్లబ్ భువనగిరి చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా 300 మంది పైగా విద్యార్థులకు పరీక్షలు, 100 విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలుగుల ఆగేశ్వర్ రావు అధ్యక్షులు, గడ్డం జ్ఞాన ప్రకాష్ రెడ్డి డిస్టిక్ జాయింట్ సెక్రెటరీ కాకతీయ రీజియన్, ప్రిన్సిపాల్ జెల్ల స్వప్న, తవిటి వెంకటనారాయణ కార్యదర్శి, మాజి అధ్యక్షులు శెట్టి బాలయ్య యాదవ్, బాలేశ్వర్ రావు, బండారు శ్రీనివాసరావు, కరిపి నర్సింగరావు, ఇన్నర్ వీల్ అధ్యక్షురాలు ఇటిక్యాల లావణ్య, కార్యదర్శి వెంకమ్మ కోశాధికారి ఇటిక్యాల దేవేంద్ర చారి, మాజి కార్యదర్శి కూచిపట్ల సత్యనారాయణ రెడ్డి, సభ్యులు పడాల భాస్కరరావు, గట్టు భాస్కర్ రెడ్డి, క0దారు రమేష్ బాబు, ఉపాధ్యాయ సిబ్బంది, మాక్స్ విజన్, వజ్ర డెంటల్ క్లినిక్ డాక్టర్స్ పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి.జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్





అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ వర్షాకాలంలో ఎక్కువగా వ్యాపించే కాలానుగుణ వ్యాధులపై వైద్యులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. బుధవారం పట్టణంలోని బంగల్ పేట్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాల కారణంగా రోగుల సంఖ్య పెరిగే అవకాశముందని, అలాంటి పరిస్థితుల్లో వైద్యులు, సిబ్బంది సమయానికి విధులకు హాజరై, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఆసుపత్రి పర్యటన సందర్భంగా రోగుల నమోదు, రోగనిర్ధారణ పరీక్షలు, మందుల పంపిణీ వంటి అంశాలపై వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లను పరిశీలించి, వాటిని సమగ్రంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. మందుల గదిని పరిశీలించి, అందుబాటులో ఉన్న ఔషధాల వివరాలు, గడువు తేదీలను తెలుసుకున్నారు. టీకాల గదిని తనిఖీ చేసారు పారిశుద్ధ్యం విషయంలో పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య స్థితి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు ప్రైవేట్ హాస్పిటళ్లలు ధీటుగా అన్ని రకాల వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వారికి భరోసా ఇచ్చారు. ఈ తనిఖీలో జిల్లా వైద్యాధికారి డా. రాజేందర్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు ఎరువుల కొరత లేకుండా చర్యలు చేపట్టాలి.ఎరువుల దుకాణాలు తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : రైతులకు ఎరువుల కొరత రాకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్మల్ మినీ ట్యాంక్‌బండ్ సమీపంలోని గాయత్రి ఫర్టిలైజర్‌తో పాటు కొండాపూర్ గ్రామంలోని శ్రీ సాయి ఎరువుల దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాలలో ఉన్న విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ప్యాకింగ్ లేబుళ్లు, తయారీదారుల వివరాలు, గడువు తేదీలు, రిజిస్ట్రర్లు, రసీదుల పుస్తకాలను పరిశీలించారు. అన్ని రికార్డులు సరిగ్గా నిర్వహించాలని యజమానులకు సూచించారు. రైతులకు అవసరమైన పరిమాణంలో మాత్రమే ఎరువులు విక్రయించాలన్నారు. ఎరువుల కొనుగోలుకు వచ్చిన రైతులతో మాట్లాడిన కలెక్టర్, వారి సాగు చేసిన పంటలు, భూమి విస్తీర్ణం వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు నకిలీ విత్తనాలు, మందులు కొనకూడదని, ఎరువుల కృత్రిమ కొరత సృష్టించిన వారిపై కఠిన చర్యలు

తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎరువులు, క్రిమిసంహారక మందులు భూసారానికి అనుగుణంగా వాడాలని, అధికంగా వాడితే దిగుబడిపై ప్రభావం ఉంటుందని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో జిల్లా వ్యవసాయ శాఖాధికారి అంజి ప్రసాద్, తహసీల్దార్లు రాజు, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## మండలం లోనీ వివిధ గ్రామాల్లో 42 కళ్యాణ లక్ష్మి చెక్కులు మంజూరు



మాజీ ఎంపీపీ నేరేళ్ల దేవేందర్

ఇబ్రహీంపట్నం అమృత్ తెలంగాణ జూలై 23 మండలం లోనీ వివిధ గ్రామాల్లో 42 కళ్యాణ లక్ష్మి చెక్కులు మంజూరు అయ్యాయని గత ప్రభుత్వం లో కన్నా ఇప్పుడు ఉన్న ప్రజాప్రభుత్వం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం లో తొందరగా కళ్యాణ లక్ష్మి చెక్కులు మంజూరు అవుతున్నాయని దీనికి కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగ్ రావు ప్రభుత్వంతో మాట్లాడి త్వరగా వచ్చే విధంగా చొరవ తీసుకుంటున్నారని ఇబ్రహీంపట్నం మాజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్ తెలిపారు

## ఆర్మీ జవాన్ ఆకాష్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ సభ్యులు.

### 50,000/ రూపాయల ఆర్థిక సహాయాన్ని - నేడు అందించిన ఆడే గజేందర్ (టీం)సభ్యులు.




ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ బజార్హత్నూర్ మండలంలోని వర్తమన్నూర్ గ్రామానికి చెందిన యువకుడు ఆర్మీ జవాన్ ఆకాష్ మృతి చెందగా నిన్న అంతక్రియలు వర్తమాన్నూర్ గ్రామంలో జరిగాయి ఈ సందర్భంగా అంతక్రియల్లో పాల్గొన్న బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ మాట్లాడుతూ తక్షణం కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని తనవంతుగా 50,000/- వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రకటించడం జరిగింది దాని అనుగుణంగా ఆడే గజేందర్ ఆదేశాలమేరకు ఆడే గజేందర్ (టీం) సభ్యులు ఆర్మీ జవాన్ ఆకాష్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందించరూ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆకాష్ కుటుంబనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు జిల్లా ఇన్చార్జ్ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ పరంగా కూడా ఆదుకునే విధంగా చోరువా చూపిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సురేష్, గస్కంటి రవి,(AGF)టీం ఎండి సద్దాం,మౌలానా, క్రాంతి, తీగల విలాస్, గ్రామస్తులు ఉన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

భువనగిరి :అమృత్ తెలంగాణ: ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల తక్షణ పరిష్కారం కోసం దశలవారీగా ఆందోళన కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉపాధ్యాయుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో భువనగిరి తాసిల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిటిఎఫ్ అధ్యక్షులు ఏన్ లక్ష్మీనరసింహారెడ్డి, యుటిఎఫ్ కార్యదర్శి జి రమణ రావు లు మాట్లాడుతూ విద్య ఉపాధ్యాయ రంగంలో ఏళ్ల తరబడి ఉన్న సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని కోరారు. ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతులు షెడ్యూలు తక్షణమే విడుదల చేయాలని, జీవో నెంబర్ 25న సవరించి ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలని, 40 మంది విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక టీచర్ ఉండాలని కోరారు. అన్ని రకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులకు పెన్షన్ బెనిఫిట్స్ విడుదల చేయాలని కోరారు. సిపిఎస్ రద్దుచేసి ఓపీఎస్లో పునరుద్ధరించాలని, 30 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ కార్యాలయంలో అందజేస్తూ, పై సమస్యలను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో యుఎస్పిసి నాయకులు పి సుదర్శన్ రెడ్డి, పి వెంకన్న, కే శ్రీశైలం, ఏ నాగేందర్, ఏం ఆంజనేయులు పాల్గొన్నారు.

# యువత భావోద్వేగాలకు ప్రతిరూపం 'ఎఐఆర్'




అమృత్ తెలంగాణ ఊహల పల్లకీ ఎక్కి, కలల లోకంలో విహరించడం, మేఘాల్లో తేలిపోవడం చాలా తేలికైన విషయాలు. ఖర్చు లేని సరదాలు. కానీ ఆ పల్లకీని కిందకు దించి, తన కలల్ని మరొకరికి చూపించి, వాళ్ల కళ్ల ముందు కొత్త లోకాన్ని ఆవిష్కరించడమే 'సినిమా'. సినిమా అంటే గ్రాఫిక్స్ మాయాజాలమో, గగుర్పాటు కలిగించే విన్యాసాల సమాహారమో కాదు. బలమైన మాధ్యమం. విశ్వశ్రేయస్సును కోరుకునే దృశ్య కావ్యం. సాహిత్యానికి వర్తించే విలువలే చలనచిత్రానికీ వర్తిస్తాయి. వినోదంతో పాటూ వికాసాన్నీ అందించాలి. వర్తమానమనే తెరమీద, గతాన్ని గుర్తుచేసి, భవిష్యత్తు దిశగా ప్రేక్షకులతో అడుగులేయిస్తుంది. నిద్రలో ఉన్నవారిని తట్టిలేపినట్టు, నిద్రాణమైన శక్తిసామర్థ్యాల్ని గుర్తుచేస్తుంది. ఇలాంటి విషయాలను ప్రోదుచేసుకుని తీసిన వెబ్ సిరీస్ 'ఆలిండియా ర్యాంకర్స్ (ఎఐఆర్)'. ఇందులోని ఇతివృత్తం మొత్తం యుక్తవయసులోని యువతీయువకుల భావోద్వేగాలను పట్టిచూపుతుంది.

టీనేజ్‌లోకి అడుగుపెట్టగానే రెక్కలు విప్పుకొని సీతాకోకచిలుకలా స్వేచ్ఛగా ఎగిరిపోవాలనిపిస్తుంది. సొంత నిర్ణయాలు తీసుకోగలమనీ, వ్యక్తిగత స్వేచ్ఛ అవసరమనీ%ఔ% గట్టిగా అరిచి చెప్పాలనిపిస్తుంది. మరోపక్క హార్మోన్ల ప్రభావంతో మనసూ, శరీరం మొరాయిస్తుంటాయి.

సరిగ్గా ఇప్పుడే అమ్మానాన్నలు పెట్టే ఆంక్షలు, సమాజం విధించే కట్టుబాట్లు కలవరపెడుతుంటాయి. అయినా సరే, ఏదో చేసేయాలన్న తపన యుక్తవయస్సు పిల్లల్లో వెంటాడుతుంటుంది. తల్లిదండ్రులు, పిల్లలు, చదువులు అనే ఈ మూడు విషయాలపై దర్శకుడు చాలా అద్భుతంగా తెరకెక్కించారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల జీవితాల చుట్టూ అల్లుకున్న కథే ఆల్ ఇండియా ర్యాంకర్స్ వెబ్‌సిరీస్. మొత్తం 7 ఎపిసోడ్‌లతో రూపొందిన ఈ సిరీస్ ఈనెల నుంచే సామాజిక మాధ్యమాల్లో స్ట్రీమింగ్ అవుతోంది.

కథ సాగిందిలా

ఈ సినిమాలో కథ 2012లో మొదలవుతుంది. అర్జున్ (హర్ష్ రోషన్), రాజు (జయతీర్థ), ఇమ్రాన్ (భానుప్రకాష్) వేర్వేరు పాఠశాలల్లో పదో తరగతి పూర్తి చేస్తారు. అప్పటికే జయశ్రీ (అక్షర) పట్ల ఆకర్షితుడైన అర్జున్, ఆమె విజయవాడలోని ప్రతిష్టాత్మకమైన ఆల్ ఇండియా ర్యాంకర్స్ జూనియర్ కాలేజీలో చేరుతుందని తెలుసుకుని, తానూ అందులోనే చేరతాడు. ఆ తర్వాత జయశ్రీ ఆ కాలేజీలో చేరడం లేదని తెలిసిన అర్జున్, అక్కడి నుంచి బయటపడాలని నిర్ణయించుకుంటాడు. సరిగ్గా అదే సమయంలో అతనికి రాజు, ఇమ్రాన్ పరిచయమవుతారు. ఇమ్రాన్ ఉచిత సీటు కారణంగా ఆ కాలేజీలో చేరతాడు, కానీ హాస్టల్ ఫీజు కట్టుకోవడం అతనికి భారంగా మారుతుంది. మారుమూల పల్లెటూరిలో పెరిగిన ఇమ్రాన్‌కు హాస్టల్ వాతావరణం అస్సలు సరిపడదు. దాంతో, అతను కూడా అక్కడి నుంచి వెళ్లిపోవాలని భావిస్తాడు. ఇక, స్కూల్ ఎగ్గొట్టి తిరిగే రాజుకి హాస్టల్ ఒక పంజరంలా అనిపిస్తుంది. సాధ్యమైనంత త్వరగా కాలేజీ నుంచి బయటపడాలనే ఆలోచనలోనే అతను ఉంటాడు. ఇలా, ముగ్గురి లక్ష్యం ఒక్కటి కావడంతో వారు స్నేహితులుగా మారతారు. మేనేజ్‌మెంట్ తమను కాలేజీ నుంచి పంపించేలా చేయాలని నిర్ణయించుకుంటారు. అందుకోసం వారు ఎలాంటి ప్రణాళికలు వేస్తారు? ఆ ప్రయత్నాలు ఎలాంటి పరిణామాలకు దారితీస్తాయి? తమ పిల్లలు మంచి ర్యాంకులు సాధించాలని కలలు కన్న వారి తల్లిదండ్రుల కోరిక నెరవేరుతుందా? జయశ్రీతో కలిసి చదువుకోవాలనే అర్జున్ కోరిక తీరుతుందా? అనేది మిగతా కథ.

ర్యాంకుల వేటలో పిల్లలతో ఆటలు

తమ పిల్లవాడు ఇంజనీరో, డాక్టరో అవ్వాలనీ, దానికోసం మంచి ర్యాంకులు సాధించాలని తల్లిదండ్రులు కోరుకుంటారు. అందులో తప్పులేదు. కానీ హోదా కోసమో, సమాజంలో గుర్తింపు కోసమో తాహతుకు మించి కార్పొరేట్, ప్రయివేటు కళాశాలల్లో చేర్పిస్తే ఎదురయ్యే ఆర్థికపరమైన ఇబ్బందులు ఒక్కోసారి ప్రాణంమీదకు తెస్తుంటాయి. ఉన్న బంగారం, ఆస్తులు కుదువ పెట్టి చదివిస్తున్నామనీ, మంచి ర్యాంకు రావాల్సిందేనంటూ తల్లిదండ్రులు కోరటం, కళాశాలల యాజమాన్యాలు బలవంతంగా బంధించినట్లుగా ఉంచి ఒత్తిడికి గురయ్యేలా చదివించే పరిస్థితులతో కొందరు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవటం నిత్యం చూస్తూనే ఉంటాం. పెద్ద కాలేజీల్లో సెక్షన్లు చేసి, తమ కాలేజీకి ర్యాంకులు తెచ్చిపెట్టేవారిపైనే ఎక్కువ దృష్టి సారిస్తూ ఉంటాయి. ఈ మధ్యలో పిల్లలు బలిపశువులవుతుంటారు. ఈ అంశాన్ని ప్రధానంగా చేసుకుని రూపొందించినదే ఈ సిరీస్. ఓ వైపు తల్లిదండ్రులు, మరోవైపు కాలేజీ మేనేజ్‌మెంట్, ఇంకోవైపు విద్యార్థులు ఈ మూడు కోణాల నుంచి ఈ కథ ఆద్యంతం ఆసక్తికరంగా నడుస్తుంది. మొదట విద్యార్థులకు, ఆ తరువాత కాలేజీ మేనేజ్‌మెంట్‌కు, చివరగా తల్లిదండ్రులకు ప్రాధాన్యతనిస్తూ కథనం సాగుతుంది. కాలేజీ క్యాంపస్‌ను, హాస్టల్ వాతావరణాన్ని దర్శకుడు ఆవిష్కరించిన విధానం సహజత్వానికి చాలా దగ్గరగా అనిపిస్తుంది. సరదా సన్నివేశాలతో పాటు భావోద్వేగాలు కూడా బాగా పండాయి.

కథనం..సాంకేతిక విలువలు

మొత్తం 7 ఎపిసోడ్లలో మొదటి మూడు చాలా ఆసక్తికరంగా సాగుతాయి. 4-5 కాస్త నిదానంగా అనిపించినా, 6, 7 నుంచి కథ మళ్లీ వేగం పుంజుకుంటుంది. సునీల్, చైతన్యరావు, హర్ష చెముడు వంటి వారిని ప్రత్యేకమైన పాత్రలలో పరిచయం చేసిన తీరు బాగుంది. మొదటి మూడు ఎపిసోడ్‌లలో మెరిసిన డైలాగ్‌లు ఆ తరువాత లేకపోవడం ఒక లోటుగానే అనిపిస్తుంది. దర్శకుడు జోసెఫ్ క్లింటన్ అక్కడక్కడా కాస్త నెమ్మదించినప్పటికీ, కథ, కథనం విషయంలో మెప్పించాడు. టీనేజ్‌లో పిల్లల మధ్య ఉండే ఆకర్షణల గురించి చక్కగానే చూపించారు. సినిజిత్ అందించిన నేపథ్య సంగీతం సందర్భానికి తగినట్టుగా ఉంది. మనోజ్ ఫొటోగ్రఫీ బాగుందనే చెప్పాలి. శ్రీకాంత్ పట్నాయక్ ఎడిటింగ్‌కు కూడా మంచి మార్కులే వేయొచ్చు. ప్రధానమైన పాత్రలను పోషించిన ముగ్గురు యువకులు హర్ష్ రోషన్, జయతీర్థ, భానుప్రకాష్ నటనతో మెప్పించారనే చెప్పాలి. సమీర్, జీవన్, సందీప్‌రాజ్ కూడా తమ పాత్రలకు న్యాయం చేశారు. 'ఇంటర్‌లో సమ్మరే ఉంటుంది-హాలీడేస్ ఉండవు', 'లోకల్ అయినా హాస్టల్లో ఉండాల్సిందే', 'ఫీజు తగ్గితే ర్యాంక్ తగ్గుతుంది', 'ఫ్రీడమ్ కోసం పంజరాన్ని ఎంచుకోవడమంటే ఇదే', 'ఊరు దాటి బయటికొచ్చాక గెలిచే వెళ్లాలి' వంటి సంభాషణలు మనసుకు హత్తుకుంటాయి.

ముగింపు సందేశాత్మకంగా

సరదాగా సాగిపోతూ, అక్కడక్కడా భావోద్వేగాలను స్పృశించే ఈ సిరీస్, వినోదంతో పాటు మంచి సందేశాన్ని కూడా అందిస్తుంది. విద్యార్థుల జీవితాలను, వారిపై తల్లిదండ్రుల అంచనాలను, విద్యావ్యవస్థలోని కొన్ని వాస్తవాలను ఈ సిరీస్ చక్కగా పట్టి చూపించింది. ఇంటర్మీడియట్ విద్యార్థుల జీవితాలను దగ్గరగా చూసిన వారికి, లేదా అలాంటి అనుభవాలు ఉన్నవారికి ఈ సిరీస్ బాగా హత్తుకుంటుంది. సందర్భానుసారంగా సాగిన హాస్యసన్నివేశాలు నవ్వుల జల్లులు కురిపిస్తాయి. తరచూ భావోద్వేగ సన్నివేశాలు ఆద్యంతం ఆకట్టుకుంటాయి. మొత్తంగా చూస్తే నేటి విద్యావ్యవస్థలోని లోపాలు, కార్పొరేట్ విద్యాసంస్థల తీరు, తల్లిదండ్రుల ఆశలకు ప్రతిరూపంగా ఈ సిరిస్ సగటు ప్రేక్షకుడిని కూడా ఆకట్టుకునేలా సాగిందనే చెప్పొచ్చు.



కేవీల్ రాములు, అమృత్ తెలంగాణ సీనియర్ రిపోర్టర్ స్టేట్ బ్యూరో

# జిఎంపిఎస్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక..



భువనగిరి :అమృత్ తెలంగాణ: జులై 22న రాయగిరి లోని లింగ బసవ గార్డెన్లో జరిగిన జిఎంపిఎస్ జిల్లా మూడవ మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా బండారు నరసింహ, జిల్లా అధ్యక్షులుగా మద్దెపురం రాజు , జిల్లా ప్రధాన కార్యదర్శిగా దయ్యాల నరసింహ తోపాటుగా మరొక 21 మంది కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షులుగా బుడమ శ్రీశైలం, మద్దిపురం బాల్ నరసింహ, సహాయ కార్యదర్శులుగా కొండే శ్రీశైలం, నారీ వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యులుగా పాక జహంగీర్, ర్యాకల శ్రీనివాస్, మన్నెబోయిన రాజలింగం, కడెం బీరప్ప, క్యాసాని నవీన్, కర్రె మల్లేష్, నారి మల్లేష్, బుగ్గ లక్ష్మయ్య, నర్రముల గణేష్, కళ్లెం సోమయ్య, గున్నబోయిన ఐలయ్య, జనిగల యాదయ్య, గాజుల అంజయ్య, కడారి కృష్ణ. లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన జిల్లా కమిటీ సమావేశం బుధవారం లింగ బసవ గార్డెన్లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి దయ్యాల నరసింహ మాట్లాడుతూ గొర్రెల కాపలా గుర్తింపు కార్డులు ఇవ్వాలని , 50 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్ ఇవ్వాలని, కుక్కల దాడిగా చనిపోయిన గొర్రెలకు నష్టపరిగా ఇవ్వాలని కోరారు. గొర్రెలకు ఉచిత బీమా సౌకర్యం, గొర్రెల కాపరులకు ప్రమాద బీమా సౌకర్యం అమలుచేసి, 10 లక్షల ఎక్స్రేషియా ఇవ్వాలన్నారు. విత్తన పోటీలు ఉచితంగా పంపిణీ చేయాలని, నగదు బదిలీ వెంటనే ప్రారంభించాలని, నేషనల్ లైవ్ స్టాక్స్ పథకంలో చదువుకున్న నిరుద్యోగ యువతకు సొసైటీ జమనతుగా రుణాలు ఇవ్వాలని కోరారు. మూడు నెలలకు ఒకసారి నటల నివారణ మందులు పంపిణీ చేయాలని, ఎన్సీడీసీ బకాయి రుణాలు మాఫీ చేయాలని, చెల్లించిన వారికి రుణమాఫీ తిరిగి ఇవ్వాలని కోరారు. అటవీ భూములో గొర్రెల మేతకు అనుమతించాలని, గ్రామ సొసైటీల పేద కాలంలో ఎన్నికలు నిర్వహించి జిల్లా యూనియన్ ఏర్పాటు చేసి, నూతన భవనం కోసం స్థలం కేటాయించాలని కోరారు. ఉపాధి హామీ పథకంలో గొర్రెల షెడ్లు నిర్మించి, గ్రామాల్లో జీవాలకు నోటితోట్లు నిర్మించాలన్నారు.

## జిల్లా కేంద్రం లోని మావల జైనథ్ మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, జూనియర్ కళాశాలను బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా.







అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ జిల్లా కేంద్రం లోని మావల జైనథ్ మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, జూనియర్ కళాశాలను బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా. MJP మావల బాలురు వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, భోజనం, ఉండేందుకు వసతి, హాస్టల్ శుభ్రత, తాగునీరు, విద్యుత్ సరఫరా, ఆరోగ్య సంరక్షణ తదితర అంశాల పై పాఠశాల గదులు, డార్మెటరి, వంట గది, బియ్యం నిల్వలను, మెనూ పట్టిక ను , బోర్ వెల్, ఆర్ ఓ ప్లాంట్ నీటి పరీక్షలను పరిశీలించారు..

గత ఏప్రిల్ మాసంలో ఉన్న పాత స్టాక్ బియ్యాన్ని వాపస్ తీసుకునేలా చర్యలు తీసుకోవాలని DM ను ఆదేశించారు.

పాత స్టాక్ ఉన్న కారణంగా బియ్యం లో పురుగులు వస్తాయని, కొత్త స్టాక్ బియ్యాన్ని వాడుకోవాలని , పాత స్టాక్ ను రీప్లేస్మెంట్ చేయాలనీ, నాణ్యతతో కూడిన సరుకులను వాడాలని, విద్యార్థులకు ఇస్తున్న క్వాంటిటీ ని తగ్గించకుండా ఇవ్వాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. వసతి గృహం విద్యార్థులకు సురక్షితంగా, ఆరోగ్యంగా, శుభ్రంగా ఉండేలా, అభ్యాస సామర్థ్యాల ను పెంపొందించేలా అన్ని చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ ఇంఛార్జి నారాయణ, dco కీర్తిని ఆదేశిస్తూ విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం సహించొద్దని స్పష్టం చేశారు.

## రాష్ట్ర ప్రభుత్వం మహిళల కొరకు ఎన్నో పథకాలు అమలుచేస్తూ వారి అభివృద్ధికి తోడ్పాటునందిస్తూ మహిళలను కోటీశ్వరులు చేయాలన్న దృఢ సంకల్పంతో ఉంది





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి రాష్ట్ర ప్రభుత్వం మహిళల కొరకు ఎన్నో పథకాలు అమలుచేస్తూ వారి అభివృద్ధికి తోడ్పాటునందిస్తూ మహిళలను కోటీశ్వరులు చేయాలన్న దృఢ సంకల్పంతో అభ్యున్నతికి కృషి చేస్తుందని అన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ప్రభుత్వం కల్పించిన ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సదుపాయాన్ని 200 కోట్ల మంది వినియోగించుకున్న సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రం లోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం లో ఘనంగా సంబురాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహాలక్ష్మి పథకాన్ని అమలులోకి తెస్తూ, మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ వసతిని కల్పించిందని గుర్తు చేశారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 200 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని వినియోగించుకున్నారని వివరించారు. తద్వారా ప్రయాణ ఛార్జీల రూపంలో రూ. 6680 కోట్లు మహిళలకు ఆదా అయ్యాయని అన్నారు. ఈ మొత్తాన్ని ఆర్టీసీ సంస్థకు ప్రభుత్వం చెల్లిస్తోందని తెలిపారు. జిల్లాలో 1.75 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేసుకున్నారని తెలిపారు. ఉచిత ప్రయాణ వసతి వల్ల మహిళలు తమ అవసరాల నిమిత్తం విరివిగా ప్రయాణ సదుపాయాన్ని వినియోగిస్తున్నారని అన్నారు. పురుషులతో సమానంగా మహిళలు ప్రయాణ వసతి పొందుతున్నారని అన్నారు. ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే మహిళల సంఖ్య గణనీయంగా రోజూ రోజుకు పెరుగుతున్నదని , ఉచిత ప్రయాణ సదుపాయాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ సంస్థ ద్వారా ఆయా పాఠశాలల విద్యార్థినులకు నిర్వహించిన వ్యాస రచన పోటీలలో గెలుపొందిన బాలికలకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. పలువురు మహిళా ప్రయాణికులను, ఆర్టీసీ సిబ్బందిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సలోని,ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోమరాజు భవాని ప్రసాద్, డిపో మేనేజర్ ప్రతిమ, సారధి కళాకారులు ప్రయాణికులు , పాల్గొన్నారు.

# విద్యాసంస్థల బంద్ విజయవంతం: మాగాణి ప్రశాంత్

ఉప్పునుంతల : అమృత్ తెలంగాణ: ఉప్పునుంతల మండల పరిధిలోని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మండలంలో విద్యాసంస్థల బంద్ నిర్వహించడం జరిగిందని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి మగాని ప్రశాంత్ తెలిపారు. ఈ సందర్భంగా బంద్ ను ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ మండల నేత చింతల నాగరాజు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో విద్యాశాఖకు విద్యాశాఖ మంత్రి నియమించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న టీచర్, ఎం ఈ ఓ, డి ఇ ఓ పోస్టులు భర్తీ చేయాలి. ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి. అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలకు మౌలిక సదుపాయాలు కల్పించి, నిధులు ఇవ్వాలి. అన్ని స్కూళ్లలో పి ఈ టీ పోస్టులు భర్తీ చేయాలి. స్వీపర్, అటెండర్ పోస్టులను భర్తీ చేయాలి. విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత బస్ పాస్ ఇవ్వాలి. హాస్టల్ విద్యార్థులకు పెండింగ్ కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలి. అద్దె భవనాల్లో నడుస్తున్న వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలి. బెస్ట్ అవైలబుల్ స్కీమ్ పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి. ఎయిడెడ్ పాఠశాలలకు పెండింగ్ నిధులు



ఇవ్వాలి. ఇంటర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలి. పెండింగ్ స్కాలర్షిప్స్ మరియు ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడుదల చేయాలి.

# జూరాలను సందర్శించిన డీఐజీ



వనపర్తి : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టును మంగళవారం ఉదయం రాష్ట్ర డిఐజి చౌహాన్ సందర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మహేష్ యువకుడు పడిపోయిన స్థలాన్ని విషయాన్ని పోలీసుల ద్వారా తెలుసుకున్నారు. భద్రత చర్యల గురించి పోలీసులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి ఎస్పి రావుల గిరిధర్ పాల్గొన్నారు.

## అలాంటి వారికే అవకాశాలు ఎక్కువంటున్న నిధి అగర్వాల్..!




స్లో అండ్ స్టడీ విన్స్ ద రేస్ అనే ఫార్ములాతో వస్తున్న అవకాశాలను చేసుకుంటూ వెళ్తుంది ఉత్తరాధి భామ నిధి అగర్వాల్. అక్కినేని బ్రదర్స్ నాగ చైతన్య అఖిల్ ఇద్దరితో సినిమాలు చేసిన నిధి అగర్వాల్ ఆ సినిమాలు నిరాశపరచడంతో కెరియర్ రిస్క్ లో పడ్డది. ఆ టైం లోనే పూరీ జగన్నాథ్ ఇస్మార్ట్ శంకర్ అమ్మడికి మంచి బ్రేక్ ఇచ్చింది. ఆ సినిమాలో మరో హీరోయిన్ నభా నటేష్ ఉన్నా కూడా నిధి గ్లామర్ షోకి ఎక్కువ మార్కులే పడ్డాయి. ఆ సినిమాతో కెరియర్ జోష్ వచ్చినా ఆ తర్వాత మళ్లీ యదావిధిగానే ఆఫర్లు లేకుండాపోయాయి. ఇక ఖాళీగా ఎందుకని గల్లా అశోక్ తొలిపరిచయంగా చేసిన హీరో సినిమాలో నటించింది నిధి అగర్వాల్. ఈ గ్యాప్ లో కోలీవుడ్ షిఫ్ట్ అయిన అమ్మడు అక్కడ జయం రవి శింబు లాంటి స్టార్ హీరోలతో నటించి క్రేజ్ తెచ్చుకుంది. తెలుగులో కన్నా తమిళంలో ఎక్కువ పాపులర్ అయ్యింది నిధి అగర్వాల్. రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో తన సినీ జర్నీపై స్పందిస్తూ.. సినిమాల్లో 20 శాతం నటనకు 80 శాతం అందానికి ప్రాముఖ్యత ఉంటుందని చెప్పింది. కేవలం టాలెంట్ ఉంటేనే ఛాన్సులు వస్తాయంటే తాను ఒప్పుకోను..

# సెకండ్ ఇన్నింగ్స్ కి రెడీ అంటున్న ముద్దుగుమ్మ..!

బెంగళూరు భామ ప్రణీత నటించిన తక్కువ సినిమాలతోనే తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది. స్టార్ హీరోయిన్ క్రేజ్ తెచ్చుకోకపోయినా సరే ప్రణీత అంటే ఇష్టపడే ప్రేక్షకులు కూడా ఉన్నారని చెప్పొచ్చు. కన్నడంలో పోకిరి రీమేక్ సినిమాతో తెరంగేట్రం చేసిన ప్రణీత తెలుగులో కూడా సినిమాలు చేసింది. యువ హీరోలు తనీష్ రామ్ సినిమాల్లో నటించిన ప్రణీత సుభాష్ పవన్ కళ్యాణ్ అత్తారింటికి దారేది సినిమాలో కూడా నటించి మెప్పించింది. ఓ పక్క సినిమాలు చేస్తూనే సడెన్ గా అమ్మడు పెళ్లి చేసుకుని షాక్ ఇచ్చింది. బిజినెస్ మెన్ నితిన్ రాజ్ తో ప్రణీత పెళ్లి అందరిని సర్ ప్రైజ్ చేసింది. ప్రణీతకి అప్పుడే పెళ్లి చేసుకోవాలనే ఆలోచన లేకపోయినా నితిన్ రాజ్ పెళ్లి ప్రపోజల్ తెచ్చే సరికి ఆవెం కాదనలేకపోయిందట. ఈ జూన్ లో ఒక బేబీకి కూడా జన్మనిచ్చింది ప్రణీత. ఆఫ్టర్ మ్యారేజ్ సినిమాలకు దూరంగా ఉంటూ వచ్చిన ప్రణీత కరోనా లాక్ డౌన్ టైం లో తన సోషల్ యాక్టివిటీస్ తో ప్రేక్షకులను అలరించింది. తనవంతు సాయంగా కొవిడ్ లాక్ డౌన్ టైం లో ఎన్నో సేవా కార్యక్రమాలు చేసింది ప్రణీత. ఇక ఇప్పుడు ప్రణీత మళ్లీ సినిమాలు చేసేందుకు రెడీ అంటుంది. సెకండ్ ఇన్నింగ్స్ గురించి మాట్లాడుతూ




ఒక మదర్ గా నా కర్తవ్యాన్ని పూర్తి చేశాను.. ఇప్పుడు సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసేందుకు సిద్ధంగా ఉన్నాను అంటూ చెప్పింది. పాపని పుట్టగానే నీ కర్తవ్యం పూర్తయిందా అంటూ ప్రణీత మీద నెటిజెన్లు కామెంట్ చేస్తున్నారు. అయితే భర్త ఎంత బిజినెస్ మెన్ అయినా కూడా తనకంటూ ఒక జాబ్ రోల్ ఉండాలని మళ్లీ తనకు ఇంత క్రేజ్ తెచ్చిన సినిమాల పైనే ఫోకస్ చేయాలని చూస్తుంది ప్రణీత. అందుకే తన ప్రతి అప్డేట్ సోషల్ మీడియాలో షేర్ చేస్తూ అలరిస్తుంది. ఈమధ్యనే మళ్లీ తన హాట్ ఫోటో షూట్స్ తో ఫాలోవర్స్ ని ఎట్రాక్ట్ చేస్తుంది ప్రణీత.

## ఎన్టీఆరా.. మజాకా.. జపాన్ భాషలో రప్ఫాడించాడు..!

మెగా పవర్ స్టార్ రాంచరణ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ కాంబినేషన్లో తెరకెక్కిన మూవీ 'ఆర్ఆర్ఆర్ (రౌద్రం రణం రుధిరం). మెగా నందమూరి అభిమానులతోపాటు యావత్ ఇండియన్ ప్రేక్షకులను 'ఆర్ఆర్ఆర్' మూవీ ఓ రేంజులో ఆకట్టుకుంది. విడుదలకు ముందు నుంచి ఈ సినిమాపై భారీ అంచనాలను పెంచిన రాజమౌళి అందుకు తగ్గట్టుగానే 'ఆర్ఆర్ఆర్'ను తెరకెక్కించింది.'అల్లూరి'గా రాంచరణ్ కొమురంభీంగా రాంచరణ్ సీతగా అలియాభట్ బ్రిటిష్ ప్రిన్సెస్ గా ఓలివియాలు నటించారు. బాలీవుడ్ నటుడు అజయ్ దేవగణ్ వెటరన్ బ్యూటీ శ్రియ శరణ్ సముద్రఖని తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు ఇండియన్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను నెలకొల్పి నిర్మాతలకు కాసులవర్షం కురిపించింది. తాజాగా ఈ మూవీని జపాన్ భాషలోనూ విడుదల చేస్తున్నారు. ఈక్రమంలోనే 'ఆర్ఆర్ఆర్' బృందం జపాన్ రాజధాని టోక్యోలో పర్యటిస్తోంది. ఉదయం నుంచే రాంచరణ్ ఉపాసన ఎన్టీఆర్ ప్రణతి రాజమౌళి రమ తదితరులు 'ఆర్ఆర్ఆర్' ప్రమోషన్స్ ను ఓ రేంజులో చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఫోటోలు వీడియోలు నెట్టింట్లో వైరల్ గా మారాయి. కొద్దిసేపటి క్రితమే 'ఆర్ఆర్ఆర్' బృందం టోక్యో వీధుల్లో 'దోస్తీ' పాటకు సందడి చేస్తూ రోడ్డును దాటారు. ఈ వీడియోను ఎన్టీఆర్ రాంచరణ్ పోస్టు చేయగా వైరల్ అయింది. అయితే తాజాగా ఎన్టీఆర్ అభిమానులు మరో వీడియోను నెట్టింట్లో వైరల్ చేస్తున్నారు. ఈ మూవీ ప్రమోషన్స్ లో భాగంగా టోక్యోలో 'ఆర్ఆర్ఆర్' టీం మీడియా ప్రెస్ మీట్ నిర్వహించింది. అయితే ఎన్టీఆర్ ఎవరూ ఊహించని విధంగా జపాన్ భాషలో మాట్లాడి అక్కడి వారిని ఆకట్టుకున్నాడు. జపాన్ భాషలో అభిమానులను పలుకరించడంతోపాటు వారిని ఉత్తేజపరిచాడు. సుమారు 70 సెకన్ల నిడివితో ఉన్న ఈ వీడియో ఎన్టీఆర్ అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# బ్యూటీ విత్ టాలెంట్.. లైగర్ భామ షైనింగ్..



బాలీవుడ్ అందాల భామ అనన్యా పాండే ఇటీవలే రౌడీ బోయ్ విజయ్ దేవరకొండతో లైగర్ సినిమాలో నటించింది. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఆ సినిమా పాన్ ఇండియా రిలీజైంది. సినిమా అంచనాలకు తగినట్టుగా లేకపోవడంతో బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. ఆ సినిమాపై ఎన్నో ఆశలు పెట్టుకున్న అనన్యా పాండే కూడా సినిమా రిజల్ట్ తో డీలా పడ్డది. లైగర్ తో సౌత్ లో సత్తా చాటాలని అనుకున్న అమ్మడికి సినిమా ఫెయిల్యూర్ షాక్ ఇచ్చింది. అంతేకాదు లైగర్ హిట్ కొడితే తెలుగులో వరుస సినిమాలు చేయాలని అనుకున్న ఆలోచనలకు బ్రేక్ పడేలా చేసింది. స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2 సినిమాతో సిల్వర్ స్క్రీన్ కి ఎంట్రీ ఇచ్చిన అనన్యా పాండే చేసిన మూడు నాలుగు సినిమాలకే బ్యూటీ విత్ టాలెంట్ అనిపించుకుంది. లైగర్ సూపర్ హిట్ అయితే ఎలా ఉండేదో కానీ ఆ సినిమా ఫ్లాప్ అవడం అమ్మడికి తెలుగులో మరో ఛాన్స్ రాకుండా చేసింది. ప్రస్తుతం బాలీవుడ్ లో కో గయే హమ్ కహన్ డ్రీం గర్ల్ 2 సినిమాల్లో నటిస్తుంది అనన్యా పాండే. సినిమాలే కాదు వెబ్ సీరీస్ లకు అమ్మడు ఓకే అనేస్తుంది. గెహ్రాయాన్ వెబ్ సీరీస్ లో దీపికా పదుకొనేకి పోటీగా అనన్యా పాండే నటనతోనూ అందంతోనూ మెప్పించింది. సోషల్ మీడియా ఫోటో షూట్స్ తో కూడా ఫ్యాన్స్ ని ఆకట్టుకుంటుంది

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com